

# సాహితీమూర్తుల సహవాసం - నరిశెట్టి ఇన్నయ్య



శ్రీ నరిశెట్టి ఇన్నయ్యగారు ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవతావాది, హేతువాది. ఎంతోమంది సాహితీమూర్తులతో ఆయనకి సన్నిహిత పరిచయాలున్నాయి. ఒక్కో సాహితీమూర్తితో తన స్నేహ పరిమళాలని నెలకొకటిగా ఈ శీర్షికలో కౌముది పాఠకులతో పంచుకుంటున్నారు.

## నేను రాసిన పత్రికలు - నాకు తెలిసిన ఎడిటర్స్

## ఆంధ్రప్రభ

## 14

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక


ఖాసా సుబ్బారావు

1938లో కాసా సుబ్బారావుగారి సంపాదకత్వన మదరాసు నుండి వెలువడింది. దీని తొలి సంపాదకీయం క్రొవ్విడి లింగరాజుగారు రాశారు. 1940 నాటికి న్యాపతి నారాయణమూర్తి ఎడిటర్ అయ్యారు. ఆయన కొద్దికాలం చేసిన తరవాత నార్ల వెంకటేశ్వరరావు ఎడిటర్ కావడంతో ఆంధ్రప్రభ తెలుగువారి ఆకర్షణీయ దినపత్రికగా శక్తివంతమైన ఆయుధంగా పరిణమించింది. మదరాసుకు లోటా పట్టుకుని వచ్చిన మార్వాడీ రామనాథ గోయంకా దీని యజమాని ఆయన పత్రికా రంగాన్ని బాగా విస్తృతం చేశారు. మదరాసులో ప్రచురితమయ్యే ఆంధ్రప్రభ పొద్దున్నే వివిధ ప్రాంతాలకు చేరేది. నేను హైస్కూలు చదువుతున్న రోజులలో ఆంధ్ర ప్రభకు అలవాటు పడ్డాను. నార్ల హెడ్డింగులు పెట్టడంలోను పేజీ గెటప్ లోను కొత్త శీర్షికలు ప్రవేశపెట్టటంలోను ఆరితేరిన వ్యక్తి. మదరాసు ప్రభుత్వంలో టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రభ రాజకీయవాదులపై చాలా ప్రభావం చూపించింది. నార్ల ఏమి రాస్తున్నాడో అని ఎదురు చూసేవారు. ప్రత్యేక ఆంధ్ర ఆందోళనలోను ఆంధ్రకు

రాజధాని ఏర్పాటు లోను ఆంధ్రప్రభ విశిష్ఠ పాత్ర వహించింది. రాజధాని ఏర్పాటు విషయమై చర్చ అనంతరం కర్నూలులో తాత్కాలిక రాజధాని ఏర్పాటు చేసినప్పుడు దానికి అనుకూలంగా కళా వెంకటరావు, గౌతు లచ్చన్న ఓటు వేశారు. దానిపై ఒక పూర్తి పేజీ ఎడిటోరియల్ రాసిన నార్ల కొత్త ఒరవడులు తొక్కారు.

గుంటూరు నుండి ఏదైనా సమావేశం జరిగినప్పుడు ప్రభకు వార్తలు పంపిస్తే ప్రచురించేవారు కాదు. అక్కడ సోమయాజులని ప్రధాన విలేఖరిగా వుండేవారు. కొన్నాళ్ళు వేచి ఉన్న తరవాత బి.ఎస్.ఆర్. కృష్ణ, దరువూరి వీరయ్య, నేను గుంటూరులో అరండల్ పేటలోని ప్రజావాణి కార్యాలయంలో కూర్చుని ఒక వ్యూహం పన్నాం. గుంటూరు జిల్లా కళాకారుల మహాసభలు జరగబోతున్నట్లు దానికి ప్రధాన అతిథిగా అక్కినేని నాగేశ్వరరావును ఆహ్వానించినట్లు వార్త పంపించాము. అది కేవలం మేము కల్పించిన వార్త అయినప్పటికి ఆంధ్రప్రభ ప్రధానంగా ప్రచురించింది. అది చూచి నవ్వుకున్నాం.

1955లో సుప్రసిద్ధ మానవవాద నాయకుడు, తత్వవేత్త ఎమ్.ఎన్.రాయ్ డెహ్రాడూన్ లో చనిపోయారు. దేశంలోని అన్ని పత్రికలు ఆ వార్తను ప్రచురించాయి. ఆంధ్రప్రభ మాత్రం ఎక్కడా వార్త వెయ్యలేదు. ఆ సందర్భంగా గుంటూరు ఏకాదండయ్య హాలులో సంతాప సభ జరిగింది. వల్లభజోస్యుల సుబ్బారావు హిందూ కళాశాల ప్రిన్సిపాలుగా అధ్యక్షత వహించారు. ప్రధానోపన్యాసకుడుగా ఆవుల గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ ...ఎవడో ఒక టొంపాయి చనిపోతే ఒక వటవృక్షం కూలింది, తార రాలింది అని సంపాదకీయాలు రాసిన నార్లకు ఎమ్.ఎన్.రాయ్ ఎవరో తెలియదా... అని ఘాటైన విమర్శ జరిపారు. ఆయన ఉపన్యాసాన్ని అక్కడి విలేఖరి సోమయాజులు యథాతథంగా పంపగా నార్ల తక్షణమే స్పందించి గుత్తికొండ నరహరికి కబురు చేసి రాయ్ సాహిత్యం అంతా పంపించమన్నారు. అది చదివిన తరవాత నార్ల మారటం ప్రారంభించారు. క్రమేణ మానవవాదిగా పరిణమించారు. 1958లో నార్ల సంపాదకుడుగా విరమించి విజయవాడకు వచ్చేశారు. ఆ తరువాత ప్రభకు ఎడిటర్లుగా నీలంరాజు వెంకటశేషయ్య ప్రభృతులు పనిచేశారు. 1963లో ఆయన సంపాదకత్వాన ఆవుల గోపాలకృష్ణమూర్తిపై ధ్వజమెత్తి, వివేకానందపై అమెరికాలో విమర్శ చేయబోతున్నాడని ఆయన్ను వెనక్కు పిలిపించాలని విపరీతంగా లేఖలు ప్రచురించారు. ప్రత్యేక ఆహ్వానంపై అమెరికా వెడుతున్న ఎ.జి.కె.కు తెనాలిలో వీడ్కోలు సభ ఏర్పాటు చేసినప్పుడు వివేకానందను గురించి గొప్పగా చెప్పమని ఒకరిద్దరు అడిగారు. ఆయన సమాధానమిస్తూ సందర్భమే వస్తే వివేకానంద గురించి ఉన్నది ఉన్నట్లు చెబుతానన్నారు. దానికి విపరీతార్థాలు తీసి ఆంధ్రప్రభ ఆందోళన చేసింది. అమెరికా ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదు.

ఆంధ్రప్రభ సంపాదకీయాన్ని గురించి ఆలపాటి రవీంద్రనాథ్ తన జ్యోతి పత్రికలో వ్యాఖ్యానిస్తూ ఒక కార్టూన్ ప్రచురించారు. అది రెండు నోళ్లు గల బొక్కబెరడు. సంపాదకీయం కింద రాస్తూ ఇది బొక్క బెరడా నార్ల సంపాదకీయమా... అన్నారు. పాఠకులు నవ్వుకున్నారు. అదే సమయంలో మదరాసులో నార్లగారి తొలి సంతానం చనిపోవటం కూడా యాదృచ్ఛికంగా జరిగింది. నార్ల ఎవరితోనో మాట్లాడుతూ నా కుమారుడు పోయి దుఃఖిస్తుంటే అలాంటి సందర్భంలో ఇట్లా రాస్తారా అని అన్నారు. రవీంద్రనాథ్ వెంటనే మదరాసు వెళ్ళి నార్లను కలిసి ఇది కావాలని తెలిసి రాసింది కాదని క్షమాపణ చెప్పుకున్నారు.

ఆంధ్ర ప్రభలో నేను రాసింది తక్కువ. ఆంధ్రప్రభ వీక్లీలో అప్పుడప్పుడు కొన్ని రచనలు చేశాను. క్రమేణ హైదరాబాదుకు తరలిన ఆంధ్రప్రభ ప్రాధాన్యతను కోల్పోయింది.



# ఆంధ్రప్రభ

## హిట్లర్ యుద్ధసన్నాహాలు: యూరపియస్ రాజ్యాల ఆందోళన

1938 ఆగష్టు 15వ తేదీన వెలువడిన ఆంధ్రప్రభ ప్రథమ సంచిక

ఆదివారం ఆంధ్రప్రభ అనుబంధం 14-12-86

# స్వామి అగేహానంద భారతి ఆత్మకథ

(క్రిందటి ఆదివారం తరువాయి)

## సత్సంఘ మండలిలో

సత్సంఘ మండలివారు నన్నూ, ఒక అమెరికన్ స్నేహితుడిని అంబాలాకు ఆహ్వానించారు. కంటోన్మెంట్ ఉన్న ఒక సంపన్న నగరం అది. భాష సంస్కృతి అంతా పంజాబీమయం. హిందీ మాట్లాడే ఉత్తరప్రదేశ్ వారున్నారు. దేశవిభజన అనంతరం ఉత్తరాదిలోని పశ్చిమ ప్రాంత నగరాలన్నీ సిక్కుమయం అయిపోయినాయి. పంజాబీలు డబ్బు సంపాదిస్తారు. ఖర్చు పెడతారు. సుష్టుగా భోం చేస్తాం, పళ్లరసం త్రాగుతారు. పంజాబ్‌లోని ఆంబోతులు, ఆవులు చాలా పెద్దవి. పంజాబీ స్త్రీలు దుడుకుగా ఉంటారు. మంచి దుస్తులు వేసుకుని, విందులంటే ఇష్టపడుతుంటారు. పంజాబీల ఆలోచన తక్కువ. ఇన్‌స్పెక్టర్ సత్సంఘ మండలిని ఒక సి.ఐ.డి పోలీసు స్థాపించారు. విశాలమైన అతడి గృహాన్ని మందిరంగా మార్చివేశారు. ప్రతిరోజూ ఉదయం జరిగే సమావేశాలకు జనం వస్తుంటారు. సంపన్న వర్తకులు ఎందరో చేరారు. సుప్రసిద్ధ సన్యాసులను, తదితరులను ఆహ్వానిస్తుంటారు.

స్టేషనులో మేళతాళాలతో స్వాగతం చెప్పారు. పూలదండలతో ముంచెత్తారు. పాదాలు తాకి అభివాదం చేశారు. టాప్‌లేని గుర్రపు బగ్గీని ఎక్కించారు. ఊరేగింపుగా వీధుల్లో తీసుకెళ్ళారు.

సమావేశం ఏడు గంటలకు. ఈ లోగా మమ్మల్ని విశ్రాంతి తీసుకోమన్నారు. స్థానిక పండితులు, సన్యాసులు, ఉపన్యాసాలు ఇచ్చారు. తరువాత మేము వేదిక మీదికి వెళ్ళాము. మాగౌరవార్థం బాలికలు పంజాబీ పాటలను ఆలపించారు. తరువాత నన్ను పరిచయం చేశారు.

నేను మామూలు మాటలు చెప్పదామనుకొని ఏకత్వాన్ని గురించి సాంకేతికంగా ఒక గంట సేపు ప్రసంగించాను. బ్రాహ్మణతత్వం విలువ తగ్గించకుండా జనంలోకి తీసుకెళ్ళవచ్చని నా ఉద్దేశ్యం.

వేదాంతంలోని తార్కిక లోపాలు నాకు తెలుసు. విశ్లేషణాత్మకంగా మత ప్రతిపాదనలను పరిశీలించడం కూడా అభినందనీయమే.

## స్వామి హరిగిరితో

స్వామి హరిగిరి పంజాబీ హిందూసాధువు. కాంగ్రెసు పార్టీ సభ్యుడు. పంజాబ్‌లోని హిమాలయ పర్వత ప్రాంతంలో మఠాధిపతిగా ఉంటున్నాడు. స్వంతంగా తయారు చేసుకున్న కాషాయ టోపీని పెట్టుకుంటాడు.

ఉన్నత సంస్కృతికి దక్షిణాది ప్రతీక దక్షిణాది భావనలను నేను పేర్కోలేదు. ఉత్తరాది సంగీతాన్ని అధ్యయనం చేసినప్పటికీ, నాకు దక్షిణాది సంగీతం ఇష్టం. దక్షిణాదిలో కొందరు భక్తి కవులు సంప్రదాయ మార్మిక వాదంలో ఇంద్రియ ప్రేరణతో కూడిన భావను వాడారు. దక్షిణాది సంగీతం విన్నప్పుడు, నా చికాకులన్నీ ప్రక్కకు పెట్టేవాడిని.

త్రివేండ్రంలో తిరువాన్కూర్ మహారాజాను కలిశాను. దక్షిణ మలబార్‌లో పాల్‌ఘాట్ వద్ద గాంధీ ఆశ్రమంలో కొన్ని వారాల పాటు గడిపాను.

కన్యాకుమారి వెళ్ళాను. నా వెంట అచ్యుతన్, అతని భార్య లక్ష్మీ కుట్టియమ్మ వచ్చారు. కన్యాకుమారి విగ్రహం చాల అందంగా కనిపిస్తుంది. విగ్రహానికి సమీపంలో రాత్రింబవళ్ళు కూర్చుని క్రతువులన్నీ తిలకించాను. నంబూద్రి పురోహితుడొక్కడే ఆ దేవత దగ్గరకు రావచ్చు. మిగిలిన సన్యాసులు, బ్రాహ్మణులు బయటకూర్చుని చిన్న గేటు ద్వారా విగ్రహాన్ని తిలకిస్తారు. పురోహితుడు దేవి విగ్రహాన్ని పాలు, రోజానీరు, నెయ్యి, మరి కొన్ని విలువైన పదార్థాలతో విగ్రహాన్ని నిమురుతూ స్నానం చేయిస్తారు. దీని వెనుక నున్న మనస్తత్వాన్ని అధ్యయనం చేయాలంటే ఫ్రాయిడ్ గాక, యూంగ్ పనికొస్తాడు. ప్రతి సంవత్సరం ఒక వారం పాటు నేను ఇక్కడికి వచ్చి గడిపేవాడిని.

## కాలడి ఆశ్రమంలో

కాలడి ఒక చిన్న గ్రామం. శంకరాచార్యుడు అక్కడే పుట్టాడు. హిందూ మతంలో అతను అత్యున్నత పండితుడు. కాలడికి వరుసగా రెండేళ్ళు వచ్చాయి. ఈ సారి రామకృష్ణమిషన్ కేంద్రంలో స్వామి ఆగమానంద అతిథిగా ఉన్నాను. స్వామి ఆగమానంద తాత్విక సంస్కృతంలో గట్టి పండితుడు. చక్కని ఇంగ్లీషు మాట్లాడుతాడు. ఆయనంటే చుట్టుపట్ల ఉన్న క్రైస్తవులకు భయం.

అతని దృష్టిలో రామకృష్ణ, శంకరాచార్య ఒకే సంప్రదాయంలో ద్రష్టలు. శంకరాచార్య చెప్పినదాన్ని రామకృష్ణుడు అవతారంగా పరిపూర్తి చేశాడు. 1200 సంవత్సరాల ఎడంలో పుట్టినప్పటికీ, శంకరాచార్య, రామకృష్ణ ఒకేరోజున పుట్టారు. వీరిద్దరి మధ్య మౌలికంగా తేడా లేదంటారు. ఆగమానంద దృష్టిలో ప్రపంచంలోని మౌలిక బోధనలన్నీ ఒకటే. శంకరాచార్యుడు కేవల నిరీశ్వరవాది. అత్యున్నత గతితార్కిక బోధకుడు. రామకృష్ణుడు భక్తిని ప్రచారం చేశాడు. మేధస్సుకు వ్యతిరేకి. బహు ప్రాచుర్యం సంపాదించినవాడు. ఇద్దరికీ చాల తేడా వున్నది.

రామకృష్ణ-శంకరాచార్యుల జన్మదినోత్సవ సందర్భంగా నేను బ్రహ్మచారిగా రామకృష్ణ ఆశ్రమంలో చేరినప్పటి స్వాములను కలుసుకొని ఆనందించాను. నేను బొంబాయికి తొలుత వచ్చినప్పుడు నాకు

అనువాదం
డా. ఎన్. ఇన్నయ్య

ఆతిథ్యం ఇచ్చిన స్వామి శంబుదానంద కాలడి గౌరవ అతిథిగా వచ్చారు. అక్కడ తొలుత నేను ప్రసంగించాను. ఆగమానంద అడిగినట్లుగా శంకరాచార్య-రామకృష్ణను పోల్చారు. ఇరువురూ ఆధ్యాత్మిక చింతనలో నిష్ణాతులైనవారని, శక్తివంతమైన వ్యక్తిత్వం గలవారని, హిందూ సంప్రదాయానికి విధేయులని అన్నారు.

## మతం మార్పిడి వివాదం

దక్షిణాదిలో పర్యటిస్తూండగా మతం మార్పిడి క్రైస్తవుల సమస్య ఎదురయింది. సిరియన్ క్రైస్తవులు, పురాతన క్రైస్తవులతో సమస్య లేదు. కాని క్రైస్తవ ఫాదరీలు, పాశ్చాత్య మిషనరీలు మతం మార్పిడిలో క్రైస్తవ గొప్పతనం ఉందని అంటారు. ఇదే చికాకు కలిగిస్తుంది. హిందూ మతం ఇతరులను మతం మార్చదు. అది ప్రపంచ మతం కాదు. బౌద్ధ, ముస్లిం, క్రైస్తవ మతాలకు మారినట్లు హిందువుగా మారడానికి వీల్లేదు. హిందూ కులాల్లో పుట్టినవారే హిందువులు. ఇతర మతాల కంటె తమ మతం గొప్పని హిందువులు చెప్పరు.

నాగర్‌కోయిల్‌కు సమీపంలో ఒక పెద్ద చర్చి ఉన్నది. పాడకాంగూలం అనేచోట ప్రజలు ఫాదరీలతో పడక, మళ్ళీ హిందూ మతంలోకి మారాలనుకున్నారు. ఒకప్పుడైతే ఇది అసాధ్యమేమో గాని, రాను రాను దక్షిణాదిలో ఇలాంటి మార్పులకు అవకాశం ఏర్పడింది. మేము పాడకాంగూలం వెళ్ళేసరికి తమిళంలో భజన చేస్తూ, సుమారు 5 వేలమంది కనిపించారు. ఆర్ముగన్ నన్ను చొక్కా విప్పేయమని, నాకు గంధం పూసి, నొసటిపై త్రిపుండ్రం పెట్టాడు. నా వంటి నిండా [illegible] సన్నట్టుగా విబూధి పూశారు. ఇలాంటివాటిని వివేకానందుడు పులిమచ్చలుగా వర్ణించాడు.

వేలాయుధం నన్ను నాగర్‌కోయిల్‌కు తీసుకెళ్ళాడు. నాడార్ జాతివారు హిందువులుగా మారారని తరువాత తెలుసుకున్నాను. 5 వేల మందిలో హఠాత్తుగా మార్పు రావడానికి నా ఉపన్యాసం కారణం కాదు. కాని నేను పాడకాంగూలం పోవటం వలన స్థానిక హిందూ నాయకులకు కొంత చేయూత లభించింది. హిందూ ధర్మానికి గౌరవాన్ని ఇవ్వాలని వారు తలపెట్టారు. అలాంటి సమావేశాలకు నేను వెళ్ళటం ఆ ఒక్కసారే జరిగింది.

(సశేషం)

**COMMENTS**